శిక్ష

వసుంధర

పార్వతమ్మ ఆందోళనగా వీధి గుమ్మంలో నుంచుని రోడ్డు మీద వచ్చేపోయేవారిని పరీక్షగా చూస్తోంది.

రెండు రోజుల క్రితం వేణు ఇంట్లోంచి పారిపోయాడు. వేణు ఆమెకు ఒక్కగా నొక్క కొడుకు. అతి గారాబంచేసి పెంచారు. జులాయిగా తయారయ్యాడు.

రెండు రోజుల క్రితం వేణు పక్కింటమ్మాయి చేయి పట్టుకున్నాడు. ఆ పిల్ల సాచి లెంపకాయ కొట్టింది. ఆమె తలిదండ్రులు రెండు దవడలూ వాయించినకంటె ఎక్కువగా మాటలన్నారు. పార్వతమ్మ భర్త రాఘవులు కోపాన్నణచుకోలేక—"ఇకమీదట నీ ముఖం నా కళ్ళ బడకూడదు—పో!" అన్నాడావేశంగా.

వేణులో పౌరుషానికేం తక్కువలేదు. వెంటనే బయటకు వెళ్ళిపోయాడు. వెళ్ళినవాడు రాత్రికూడా ఇంటికి రాలేదు. ఆ మర్నాడూ యింటికి రాలేదు.

పార్వతమ్మ భర్తను వేధించసాగింది. కేవలం అదో

క్కటే కారణం కాక—తనకూ కొడుకు గురించి ఆందోళనగా ఉండడంవల్ల రాఘవులు వెతకడానికి బయల్దేరాడు. ఉదయమనగా వెళ్ళాడు. ఇప్పుడు మధ్యాహ్నం మూడు గంటలయింది. ఇంతవరకూ రాలేదు.

వంట చేసింది కానీ భోజనం కూడా చేయకుండా ఎదురు చూస్తోంది పార్వతమ్మ. ఎంతకూ భర్త జాడ లేదు.

“ఏమయిందో—ఎక్కడ తిరుగుతున్నాడో?” అనుకుంది పార్వతమ్మ.

సరిగ్గా అప్పుడే ఆమె దృష్టినో వ్యక్తి ఆకర్షించాడు.

ఆజానుబాహువు. కాషాయాంబరధారి. ముఖంలో గొప్ప తేజస్సుంది. గుబురుగా పెరిగిన గడ్డం కూడా ఆ తేజస్సును దాచలేకపోతోంది. మధ్యాహ్నపు ఎండలో కూడా కమిలిపోకుండా మిలమిల మెరుస్తున్న పసిమి ఛాయ అతడిది.

అతడు సాలోచనగా రోడ్డుమీంచి వెడుతూండగా చూసిన పార్వతమ్మ-“స్వామీ!” అని గట్టిగా పిలిచింది.

ఆ వ్యక్తి ఉలిక్కిపడి ఆమెవంక తిరిగి—ఆ ఇంటిని సమీపించాడు. ప్రశ్నార్థకంగా ఆమె వంక చూశాడు.

“మిమ్మల్ని చూడగానే నాకు మీలో దేవుడు కనిపించాడు. నా మనసులోని ఆందోళనను మీకు చెప్పుకోవాలనుంది. ఒక్కసారి లోపలకు వస్తారా?” అనడిగింది పార్వతమ్మ.

“ఆకలిగా వుంది. భిక్ష వేస్తావా?” అన్నాడా వ్యక్తి.

“అయ్యో—ఎంత మాట! మీ గురించి వంట సిద్ధంగా వుంది. రండి—భోజనం చేద్దురుగాని....” అంది పార్వతమ్మ.

ఆ వ్యక్తి ఇంట్లో ప్రవేశించాడు. తనే తలుపులు

వేశాడు. పార్వతమ్మను నీళ్ళడిగి పాదాలు, ముఖం కడుక్కున్నాడు. నేలమీద కూర్చున్నాడు. అరిటాకు కావాలన్నాడు.

పార్వతమ్మ అన్నీ యేర్పాటు చేసింది.

ఆ వ్యక్తి అరిటాకులో భోజనం చేశాడు. పార్వతమ్మ ముగ్గురు మనుషులకని వండిన వంట—ఆయనొక్కడూ తినేశాడు.

“కడుపునిండా భోజనం పెట్టావు. నిన్ను భగవంతుడు దీవిస్తాడు—” అన్నాడు పార్వతమ్మ వంక ప్రసన్నంగా చూస్తూ.

“తమ పేరు స్వామీ!” అంది పార్వతమ్మ.

“నాకు పేర్లతో పనిలేదు. నేనొక సన్యాసిని—” అన్నాడా వ్యక్తి.

భోజనం కాగానే ఆయన కూర్చునేందుకో కుర్చీ చూపించి తనాయన పాదాలవద్ద కూర్చుంది పార్వతమ్మ.

సన్యాసి మౌనంగా ఆమెవంకే చూస్తున్నాడు. పార్వతమ్మ చాలా సేపు తలవంచుకుని ఉన్నట్లుండి తలెత్తి “స్వామీ నా కొడుకు క్షేమంగా తిరిగి వస్తాడా?” అనడిగింది.

“ఏమయింది నీ కొడుక్కి?” అన్నాడు సన్యాసి.

పార్వతమ్మ క్లుప్తంగా ఆయనకు జరిగింది చెప్పింది.

అది వింటూనే సన్యాసి ముఖం గంభీరంగా అయిపోయింది.

“నీ యింట్లో పూజామందిరముందా?” అన్నాడాయన.

“ఉంది స్వామీ!”

“పద—అక్కడకు వెడదాం!”

ఇద్దరూ పూజామందిరం వద్దకు వెళ్ళారు.

సన్యాసి మందిరం ముందు పద్మాసనం వేసుకుని కళ్లు మూసుకొని కూర్చున్నాడు. అస్పష్టంగా యేదో మంత్రోచ్చారణ చేశాడు.

పార్వతమ్మ ఆత్రుతగా ఆయన వంకనే చూస్తోంది.

కాసేపటికి సన్యాసి కళ్ళు తెరిచి — "నీ కొడుకు బాగా చెడిపోయాడు. సమాజానికి చీడపురుగుగా తయారయ్యాడు—" అన్నాడు.

పార్వతమ్మ ముఖం వెలవెలబోయింది — "వాడిప్పుడెక్కడున్నాడు స్వామీ?"

"ఒక వేశ్య యింట్లో — "

"క్షేమంగా ఉన్నాడా స్వామీ!"

"ఉన్నాడు. కానీ అతడి ప్రాణాలకు త్వరలోనే ముప్పు వాటిల్లనుంది...."

పార్వతమ్మ భయంతో కంపించిపోయింది.

సన్యాసి నిట్టూర్చి—"నీ కొడుకు చెడు దారిలో నడుస్తున్నాడు. ఆ దారి వదిలిపెడితే తప్ప అతడి ప్రాణాలకు రక్షణలేదు. అతణ్ణి మంచి మార్గాన పెట్టడానికి నీ కాయశక్తులా ప్రయత్నించు—" అన్నాడు.

"అది సాధ్యపడుతుందంటారా?"

"మొక్కై వంగనిది మానై వంగడం సాధ్యంకాదు. అయినా ప్రయత్నించడంలో తప్పులేదు-...." అన్నాడు సన్యాసి.

"ఇప్పుడు వాడింటికి వస్తాడా స్వామీ!"

"నేను వివరాలు చెబుతాను. వెళ్ళి అతణ్ణి తెచ్చుకోండి. అయితే అతడి ప్రాణాలు రక్షించడం నావల్ల కాదు—" అన్నాడు సన్యాసి.

"అందుకే ఉపాయమూ లేదా స్వామీ!"

సన్యాసి క్షణంపాటు తీవ్రంగా ఆలోచించి—"నీ ఇంట్లో పనసకాయ కత్తి ఒకటుంది. రెండ్రోజుల క్రితమే దానికి పదును పెట్టించావు. అవునా?" అన్నాడు.

పార్వతమ్మ ఆశ్చర్యంగా—"అవును—" అంది.

"అదే నీ కొడుకు ప్రాణాలు తీస్తుంది—" అన్నాడు సన్యాసి.

"అయితే ఆ కత్తిని కమ్మరివాడికిచ్చి కరిగించేస్తాను—"

"అలాంటి తెలివితక్కువ పనులు చేయకు. రానున్న చావును శ్రీకృష్ణభగవానుడే తప్పించుకోలేకపోయాడు. నీ కొడుకనగా ఎంత? నీ కొడుకు బ్రతకాలంటే చెడు మార్గాలు వదిలిపెట్టాలి. అదొక్కటే ఉపాయం—...."

"తెలిసి తెలిసీ ఆ కత్తినింట్లో ఉంచుకోలేనుగదా!" అంది పార్వతమ్మ.

"నిజమే! కానీ తప్పదు. ఆ కత్తి నీ చేయి దాటిపోవడం చాలా ప్రమాదం. ఈ యింట్లోనే వుండాలి. ఎవరికీ దొరకని విధంగా జాగ్రత్తగా యే పెట్లోనో పెట్టి తాళం వేయి—" అన్నాడు సన్యాసి.

"నాకు చాలా భయంగా వుంది—" అంది పార్వతమ్మ.

"భయం వివేకాన్ని పోగొడుతుంది. వివేకమే నీకు రక్ష అని మర్చిపోకు...." అని—"నీ అదృష్టం కొద్దీ నువ్వు నన్ను పిలిచావు నా శక్తులను నేను సామాన్యుల కోసం ఉపయోగించడం అరుదుగా జరుగుతుంది. నాకెన్ని శక్తులున్నా—నీవు పెట్టిన భోజనం నాలో కలిగించిన కృతజ్ఞతాభావానికవి తలలు వంచుతున్నాయి. ఒకసారి ఆ కత్తిని తీసుకునిరా—" అన్నాడు సన్యాసి.

కొద్దిక్షణాల్లో పార్వతమ్మ కత్తి తెచ్చి ఆయన

ఇచ్చింది.

సన్యాసి ఆ కత్తిని చేత్తో పట్టుకొని తీక్షణంగా పార్వతమ్మ వంక చూశాడు. తర్వాత కత్తిని గాలిలో కత్తాడు. కళ్ళు మూసుకున్నాడు. ఏదో మంత్రోచ్చారణ చేసి నెమ్మదిగా కత్తిని క్రిందకు దించి కళ్ళు తెరిచాడు.

"ఏం చేశారు స్వామీ?" అంది పార్వతమ్మ.

సన్యాసి కత్తిని పార్వతమ్మకు అందించి—"చూడు!" అన్నాడు.

కత్తిమీద కుంకుమరేఖలున్నాయి. పార్వతమ్మ వాటిని చూసి ఆశ్చర్యపడింది.

"మాత ఆశీర్వాదం లభించింది—"అని—"ఇంట్లో చిన్న పెట్టె యేదైనా వుందా?" అన్నాడు సన్యాసి.

పార్వతమ్మ అక్కణ్ణించి వెళ్ళి అడుగున్నర పొడవు, అరడుగు ఎత్తు—ఉన్న ట్రంకుపెట్టెని తెచ్చి ఆయన ముందుంచింది.

"ఇందులో ఏమున్నాయి?"

"పాత గుడ్డలుంటే తీసేశాను స్వామీ!"

"ఫరవాలేదు. అవి తీసుకురా" అన్నాడు సన్యాసి ఆమె పాతగుడ్డలు తెచ్చాక వాటి మధ్యలో కత్తిని వుంచి పెట్టెలో పెట్టి మూతవేసి గొళ్ళెం వేశాడు. తర్వాత పార్వతమ్మ నడిగి తాళంకప్పను తెప్పించి వేశాడు. తాళం చెవిని తీసుకొని దొడ్లోకి నడిచాడు. పార్వతమ్మ ఆయన్ననుసరించి వెళ్ళింది.

"ఇప్పుడు తాళాన్ని గాలిలోకి ఎగరేస్తాను. అది గాలిలోనే కలిసిపోతుంది. క్రిందపడదు—" అంటూ సన్యాసి తాళంచెవిని గాలిలోకి ఎగరేశాడు. పార్వతమ్మ ఆశ్చర్యంగా గాలిలోకి చూసింది.

తాళం చెవి తూనీగలా ఎగిరిపోతున్నట్లు మెరుస్తోంది. అది క్రిందకుమాత్రం పడలేదు.

అప్రయత్నంగా పార్వతమ్మ చేతులు జోడించి సన్యాసికి నమస్కరించి — "తమరు నిజంగా మహానుభావులు —" అంది.

"నీ సాంగత్యంతో నాకు పనిలేదు. నేను చేయగలిగింది చేశాను. ఆ పెట్టెతాళాన్నిప్పుడెవ్వరూ తెరవలేరు" అన్నాడు సన్యాసి.

"నా కొడుక్కు ప్రాణభయం తప్పినట్లేనా స్వామీ!"

"నీ కొడుక్కు అర్ధాంతరపుచావు ఆ కత్తివల్ల తప్ప జరగదు —"

పార్వతమ్మ తృప్తిగా నిట్టూర్చి — "నా కొడుకు ప్రాణాలు నిలబెట్టారు. ఏమిచ్చినా మీ ఋణం తీరదు-" అంది.

"అదంతా నీ భ్రమ — నీ కొడుక్కి చావు రాసిపెట్టి ఉన్న క్షణాన ఆ పెట్టె తాళం దానంతటదే తెరుచుకుంటుంది —...." అని — "నీ కొడుకు ప్రాణాలు తన ప్రవర్తన వల్లనే కాపాడబడతాయి. నేను కత్తిని మంత్రించానంటే అందువల్ల ఒక్కటే ప్రయోజనం. ఆ కత్తితో చావు లభిస్తే అతడీజన్మలో చేసిన పాపాలన్నీ నాశనమైపోతాయి. మరో జన్మవరకూ వేధించవు —.... మరి నేను వెడతాను —" అన్నాడు సన్యాసి.

"స్వామీ! మా అబ్బాయెక్కడున్నదీ తమరు వివరించలేదు —" అంది పార్వతమ్మ కంగారుగా.

సన్యాసి ఆమెకు వేణు వున్న యింటి చిరునామా గురించి సవివరంగా చెప్పి వెళ్ళిపోతూ — "కాసేపట్లో

నీ భర్త ఉసూరుమంటూ వస్తాడు. అతణ్ణలాగే బయటకు పంపివేయక — ముందు కడుపునిండా భోజనం పెట్టు. నీకు శుభమవుతుంది—" అన్నాడు.

సన్యాసి వెళ్ళిపోగానే పార్వతమ్మ పరుగున వంటింట్లోకి వెళ్ళింది. భర్త వచ్చేలోగా త్వరగా వంట చేయాలని ఆమె తాపత్రయం.

అయితే వంటింట్లో ఆమె వండిన వంటకాలన్నీ చెక్కు చెదరకుండా ఉన్నాయి. ఆశ్చర్యంలో పార్వతమ్మ నిశ్చేష్టురాలయింది.

తను సన్యాసికింట్లో వండిన వంటకాలన్నీ ఊడ్చి పెట్టేసింది. ఇప్పుడవన్నీ ఎలా తిరిగొచ్చాయి? అసలు సన్యాసి నిజంగా తనింటికి వచ్చాడా—కలగన్నదా?

ఇలా ఆలోచిస్తూండగానే తలుపుతట్టిన శబ్దమై మామూలు మనిషయింది పార్వతమ్మ. ఆమె ఒక్క ఉదుటున వెళ్ళి తలుపుతీసింది.

రాఘవులు వీధిగుమ్మం దగ్గర నీరసంగా నిలబడి ఉన్నాడు.

"అబ్బాయి కానీ ఇంటికొచ్చాడా?" అన్నాడు దిగులుగా.

"రాలేదు. ముందు లోపలకు రండి—" అంది పార్వతమ్మ. ఆమె భర్తకు జరిగిందంతా అప్పుడే చెప్పదల్చుకోలేదు. చెబితే రాఘవులు వెంటనే మళ్ళీ బయటకు వెళ్ళిపోతానంటాడని ఆమె భయం.

"ఎక్కడున్నాడో—ఏం చేస్తున్నాడో?" అంటూ రాఘవులు లోపలకు వచ్చాడు.

పార్వతమ్మ బలవంతంగా అతడిచేత భోజనం తినిపించింది. అతడితోపాటే తనూ భోంచేసింది. భోజనా

లయ్యాక జరిగింది చెప్పింది.

"నువ్వు కలగంటున్నావా?" అన్నాడు రాఘవులు.

పార్వతమ్మ భర్తకు చిన్న ట్రంకుపెట్టె చూపించింది. రాఘవులా తాళం చూసి — "దీనికేముంది? మన దగ్గర మారుతాళం చెవి వుందిగా!" అన్నాడు.

"అయ్యో! ఆ విషయమే మరిచాను—" అంది పార్వతమ్మ.

కలిమాని కుంకుమ రేఖలు చూడాలని రాఘవులు కుతూహల పడ్డాడు. అందుకని అతడు మారుతాళాలుండే గుత్తి తెచ్చాడు. సులభంగానే తాళం చెవిని గుర్తుపట్టాడు. అయితే ఆ తాళం చెవి కప్పులో దూరింది తప్ప—అటూ తిరగలేదు.

"అంతా సన్యాసి మహిమ!" అంది పార్వతమ్మ.

"నమ్మడానికి కష్టంగా వుంది—" అన్నాడు రాఘవులు.

పార్వతమ్మ ట్రంకుపెట్టెని పడకగదిలో మంచంకింద పెట్టింది. భర్తతో—"ఇప్పుడు నిమితంగా వెళ్ళి వేణును తీసుకొనిరండి—" అంది.

"నేనెప్పుడూ వేశ్యావాటికకు వెళ్ళలేదు. కొడుకు గురించి వెళ్ళాల్సి వస్తోంది—" అన్నాడు రాఘవులు బాధగా.

"ఏమైతే నేం? వాడి జాడంటూ తెలిపింది గదా...."

"కొడుకు కోసం తండ్రి వేశ్యావాటికకు వెళ్ళడం చాలా అవమానకరమైన విషయం. వాడక్కడ లేకుం టేనే నెక్కువ సంతోషిస్తాను" అన్నాడు రాఘవులు.

"అలాగనకండి—వాడి జాడ తెలిస్తే ఎన్ని అవమా

నాలైనా మనం భరించవచ్చు—" అంది పార్వతమ్మ.

రాఘవులు ఊరూరంటూ బయల్దేరాడు.

2

"నువ్వొచ్చి అప్పుడే రెండ్రోజులయింది—" అంది మధురనాయకి.

మధురనాయకికి ఆ ఊళ్ళో వేశ్యమాత అన్న పేరుంది. ఆ ఊరి వేశ్యలుకూడా ఆమెను తల్లిగా భావిస్తారు. వేశ్యాసంపర్కం కోరేవారామెను సంప్రదించడంలో ఎన్నో లాభాలున్నాయి.

వేశ్యాకులంలో పుట్టింది మధురనాయకి. వేశ్యగానే బ్రతికింది కానీ నీతినీ నిజాయితీనీ నమ్ముకుంది. ఆమె అందం ఆమెకు డబ్బును సంపాదించి పెట్టింది. నిజాయితీ ఆ కులంలోకూడా ఆమెకు గౌరవాన్నాపాదించింది.

ధూమపానంకంటె, మద్యపానంకంటె — వేశ్యావృత్తి తప్పుకాదంటుంది మధురనాయకి. మద్యం. ధూమం మగవాడికి శారీరకావసరాలు కావు. స్త్రీ పురుషులకు శారీరకంగా పరస్పరావసరం వుంది. శారీరకావసరానికి పెళ్ళి ఒక పద్ధతి. వేశ్యా సంపర్కం మరొకపద్ధతి. అయితే సమాజంలో పెళ్ళికి గౌరవస్థానముంది. వేశ్యకు లేదు. వేశ్యకు మించిన అవమానం మోసపోయిన ఆడదానిది.

పురుషుడిచే మోసపోవడం — స్త్రీకి అనాదినుంచీ అనుభవం. అలా మోసపోయిన ఆడవాళ్ళలో అప్పటికప్పుడు జీవితాలనంతం చేసుకున్నవారున్నారు. తెగిన గాలిపటాలై ముదనష్టపు చావుకు గురైనవాళ్ళూ వున్నారు.

చెడిన ఆడవాళ్ళకు మధురనాయకి ఆశ్రయమిస్తుంది. వారిని మానసికంగా వేశ్యావృత్తికి ప్రోత్సహిస్తుంది.

"చెడిన ఆడది"—అన్న పదం అర్థరహితమైనది. అది సమాజం స్త్రీని బలహీనపర్చడానికి వాడే పదమని చెబుతుంది.

మధుర నాయకిదిప్పుడో పెద్ద సంస్థ. ఆమె ఆధ్వర్యంలో అయిదువందల అందాల పడుచులున్నారు. వారికి సెంట్రల్ గవర్నమెంటు ఉద్యోగులకుండే సదుపాయా లన్నీ వున్నాయి. చెప్పాలంటే అంతకుమించిన సదుపాయాలు వారివి.

మధుర నాయకి సంస్థలోని వేశ్యలందరికీ ఉచిత భోజన వసతి సదుపాయాలున్నాయి. వారి ఆరోగ్యాన్ని కాపాడానికి డాక్టర్లున్నారు. వారి దగ్గరకు వచ్చే విటుల ఆరోగ్యాన్ని పరీక్షించడానికీ డాక్టర్లున్నారు.

విటుల నాకర్షించే బాధ్యత వేశ్యలది. వారి వారి సంపాదనలో కొంత భాగం సేవింగ్సు, కొంత భాగం మధుర నాయకికి, కొంత భాగం మెయింటెనెన్సుకు పోగా యిరవై భాగం జీతంగా యిస్తుంది.

అటు విటులకూ, ఇటు వేశ్యలకూ ప్రమాదరహితమూ, లాభకరమూ, ఆరోగ్యప్రదమూ, గౌరవనీయమూ అయిన పద్ధతిలో నడుస్తోంది మధుర నాయకి సంస్థ.

ఆకర్షణ తగ్గినవారికీ, వయసుమీరినవారికీ రిటైర్మెంటు సదుపాయముంది. జీవితంలో మరోవిధంగా స్థిరపడాలను కునేవారికికూడా మధుర నాయకి ఆర్థికంగానూ, ఇతర విధాలుగానూ సాయపడుతుంది.

మధుర నాయకి కథ మరోసారి తెలుసుకుందాం.

రాఘవులు కొడుకు వేణు ప్రస్తుతం ఆమె యింట్లో ఉన్నాడు.

వేణుకీ ఆమెకూ విచిత్రంగా పరిచయమయింది.

ఒకరోజున మధురనాయకి పార్కు లో కూర్చుని వుంది. అక్కడ వేణు ఓ అమ్మాయితో అసభ్యంగా మాట్లాడాడు. ఆమె అతణ్ణి చెప్పుతీసి కొట్టింది. ఆ దృశ్యం మధురనాయకి చూసి తనే వేణు దగ్గరకు వెళ్ళింది.

"పాపం—నీకు అవమానమయింది కదూ!" అందామె.

"ఇది నాకు అవమానమేం కాదు — అలవాటే!" అన్నాడు వేణు తడుముకోకుండా.

"అలవాటే అయితే—ఇది మంచిదికాదు—" అంది మధురనాయకి.

"మంచో, చెడో—నేను మానుకోలేను—" అన్నాడు వేణు.

"మానుకునే ఉపాయం నేను చెబుతాను. వింటావా?"

"వినను—...."

"ఎందుకని?"

"ఆడవాళ్ళంటే నాకు సరదా — నా సరదా నాకుండాలి...."

"నీ సరదా నీకుంటుంది...."

"ఎలా?"

మధురనాయకి అతడికి తన సంస్థ గురించి చెప్పుతుంది.

వేణు ఆశ్చర్యపడ్డాడు—"ఇది నిజమా?" అన్నాడు.

"డబ్బుంటే చాలు—ఇది నిజమే అవుతుంది...." అంది మధురనాయకి.

అప్పుడు వేణు చేతులో డబ్బుంది. అతడు మధురనాయకి వెంట వెళ్ళాడు. మధురనాయకి అతడిని డాక్టరు వద్దకు పంపింది. వేణు వైద్య పరీక్షకు నిరాకరించాడు.

"వైద్య పరీక్ష ఇక్కడ తప్పనిసరి!" అంది మధుర నాయకి.

"వేశ్యలకు వైద్యపరీక్షకానీ నాకెందుకు?" అన్నాడు వేణు.

"వేశ్యకు పురుషపదం విటుడు—" అంది మధుర నాయకి.

వేణు అంగీకరించి వైద్యపరీక్షకు సిద్ధపడ్డాడు. అతడి ఆరోగ్యం మంచిదేనని తేలేక ఓ యువతి వద్దకు మధుర నాయకి అతణ్ణి పంపింది.

కాసేపటికి అతడు బయటకు వచ్చి మధురనాయకిని కలుసుకున్నాడు.

"ఎలా వుంది నా ఉపాయం?" అంది మధురనాయకి.

"బాగోలేదు—" అన్నాడు వేణు.

"ఏం?"

"నాకు వేశ్య పనికిరాదు—స్త్రీ కావాలి—...."

"వేశ్య స్త్రీ కాదా?"

"నా దృష్టిలో కాదు—...."

"స్త్రీ అంటే నీ దృష్టిలో ఎవరు?"

"డబ్బు గురించికాక — నన్ను నన్నుగా ప్రేమించి ఇష్టపడే మనిషి...."

మధురనాయకి వెంటనే — "నిజమే! నీకు వేశ్య పనికిరాదు—" అంది. వేణు వెళ్ళిపోబోతూంటే ఆపి— "ఆడది నిన్ను నిన్నుగా ఇష్టపడాలంటే నడి బజార్లో చెయ్యి పట్టుకోనడంవల్ల జరిగే పనికాదు—" అంది.

"మరెలా జరుగుతుంది?"

"ఓ స్త్రీని ఎన్నుకో-ఆమెకోసం ఏమైనా చేయి...."

"ఏమైనా అంటే?"

"ఉదాహరణకు అలివేలు కథ చెబుతాను...." అంది మధుర నాయకి.

వేణు వినసాగాడు.

అలివేలు ఓ మధ్యతరగతి అమ్మాయి. పక్కింటి కుర్రాడి మాయమాటలకు లొంగిడి — అతడికి తనువు నర్పించింది. అతడు వేరే పెళ్ళి చేసుకున్నాడు. అలివేలు ఆత్మహత్య చేసుకోవాలనుకుంది. అదృష్టంకొద్దీ మధుర నాయకికి దొరికింది. ఆమె అలివేలును వేశ్యావృత్తికి ప్రోత్సహించింది. అలివేలు ఒప్పుకోలేదు. తను సమాజంలో నలుగురి ఆడవాళ్ళకులాగే బ్రతుకుతానంది.

"అలివేలు ఇప్పుడు నా దగ్గరే వుంది. ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా వ్యభిచారానికి ప్రోత్సహించలేను. ఆమెను నువ్వు పెళ్ళి చేసుకుంటావా?" అంది మధుర నాయకి.

"చెడిన ఆడదాన్ని నేను పెళ్ళిచేసుకోవాలా?" అన్నాడు వేణు.

"అలివేలు చెడిపోలేదు. నిక్షేపంలా వుంది—"

"నా దృష్టిలో ఆమె చెడిపోయినట్లే లెక్క!"

"అలివేలు దృష్టిలో నువ్వూ చెడిపోయిన వాడికిందే లెక్క! పార్కుల్లో ఆడపిల్లల చెప్పుదెబ్బలు తినేవాళ్లూ, నా యింట్లో వేశ్యాసంపర్కాన్నాశించేవాళ్ళూ-చాలా మంది దృష్టిలో చెడిపోయినట్లే లెక్క...."

"అలాంటి లెక్కల్ని నేను లెక్కచేయను...."

"లెక్కచేసినప్పుడే మళ్ళీ నా యింటి గుమ్మం తొక్కు. వెళ్ళు...." అంది మధుర నాయకి తీవ్రంగా. వేణు మొండితనం ఆమెకు చిరాకు కలిగించింది.

వేణు వెళ్ళిపోయాడు. సరిగ్గా రెండుగంటలకే అతడు మధుర నాయకి—ఇంటి గడప మళ్ళీ తొక్కాడు.

అంత త్వరగా అతను వస్తాడని ఊహించని మధుర నాయకి ఆశ్చర్యపోయి—"అలివేలు విషయంలో నీ మనసు మార్చుకున్నావా?" అంది.

"నీ యింట్లో రెండ్రోజులుండనీ—" అన్నాడు వేణు.

"ఎందుకు?"

"అలివేలును పెళ్ళి చేసుకోవాలంటే చాలా ఇబ్బందు లున్నాయి. ఇంట్లో మావాళ్ళొప్పుకోరు. నేనార్థికంగా స్వతంత్రుణ్ణి కాను...." అన్నాడు వేణు.

"నీ కాళ్ళమీద నిలబడాలన్న కోరిక నీకుంటే— నిలబెట్టే ప్రయత్నం నేను చేయగలను...." అంది మధుర నాయకి.

"ఎలా?"

"సంఘంలో నాకు గౌరవముందో లేదో తెలియదు. కానీ పలుకుబడి వుంది. నీకుద్యోగమిప్పించగలను. నిన్నో చిన్న వ్యాపారస్తుణ్ణి చేయగలను. అయితే నీకోసం మాత్రం కాదు. అలివేలు జీవితానికి రక్షణకోసం... "

"ఆలోచించుకు నేందుకు నాకు రెండ్రోజుల వ్యవధి కావాలి ..."

మధుర నాయకి అతడిని రెండ్రోజులపాటు తనింట్లో వుంచుకుంది. ఇప్పుడా రెండ్రోజులూ అయిపోయాయి.

"నువ్వొచ్చి అప్పుడే రెండ్రోజులయింది—" అందామె.

వేణుకు ఏం చెప్పాలో తోచలేదు. ఆ యింట్లో సకల సదుపాయాలూ వున్నాయి. అతడికి సుఖంగా వుంది. తలిదండ్రుల్నెదిరించి అక్కడకు వచ్చాడు. తిరిగి ఇంటికి వెళ్ళే ఉద్దేశ్యంలేదు. అలాగని అలివేలును పెళ్ళి

చేసుకోవాలనీ లేదు.

పెళ్ళి చేసుకోవటం అనవసరపు జంఝాటం.

"నీ నిర్ణయం గురించి చెప్పాల్సిన టైమొచ్చింది-" అంది మధురనాయకి మాట గట్టిగా.

ఇంటికి తిరిగి వెళ్ళడంకంటే అలివేలును పెళ్ళిచేసుకోవడమే మేలనిపించింది వేణుకు. ఆ విషయమే చెబుదామనుకుంటూండగా — లోపలికి పనిమనిషి వచ్చి— "మీకోసం యెవరో వచ్చారమ్మా!" అంది.

"ఎవరు?"

"పేరు రాఘవులని చెప్పారు..."

"రాఘవులంటే మా నాన్న పేరు. నేనిక్కడున్నట్టాయనకెలా తెలిసిందో—" అన్నాడు వేణు ఆశ్చర్యంగా.

"నువ్వూ వస్తావా?" అంది మధురనాయకి.

"రాను. నువ్వే వెళ్ళి మాట్లాడు...." అన్నాడు వేణు.

"ఏం మాట్లాడను?"

"నీ యిష్టం—నీ నిర్ణయానికి నేను కట్టుబడతాను.."

3

అందమైన ఆ డ్రాయింగ్ రూం నలువైపులా ఆశ్చర్యంగా చూస్తున్నాడు. అది సినిమాల్లో చూసే గొప్పవాళ్ళ యిళ్ళలా వుంది తప్ప వేశ్యా గృహంలా లేదు.

అప్పుడు మధురనాయకి లోపలకు వచ్చింది. ఆమెను చూస్తూనే లేచి నిలబడ్డాడు రాఘవులు.

మధురనాయకి రాజమాతలా ఉంది తప్ప వేశ్యమాతలా లేదు.

ఆమె అతడికి నమస్కరించి—"కూర్చోండి!" అంది.

రాఘవులు కూర్చున్నాడు. ఆమె అతడికెదురుగా కూర్చుని—"చెప్పండి—" అంది.

"మా అబ్బాయి వేణు ఇక్కడున్నాడని తెలిసింది-"

"ఎలా తెలిసింది?"

"చెబితే మీరు నమ్మరు. ఒక సన్యాసి దివ్యదృష్టితో చూసి చెప్పాడు...."

మధురనాయకి నవ్వి—"సన్యాసుల దివ్యదృష్టికి మాయిళ్ళు తప్ప మరేమీ కనిపించవు.... వేణు అనే కుర్రాడిక్కడే వున్నాడు—" అంది.

"వాణ్ణి తీసుకొని పోదామని వచ్చాను—"

"అతడు రానంటున్నాడు...."

"వాడితో నేనో సారి మాట్లాడాలి—"

"అతడు మీతో మాట్లాడనంటున్నాడు—...."

రాఘవులు ముఖం ఎర్రబడింది. ఏదో అనాలని ఉద్రేకంలో మాట రాక ఆగిపోయాడతడు.

"మిమ్మల్ని చూస్తే నాకు చాలా జాలిగా వుంది. మీ అబ్బాయి వేణు మానసికంగా బాగా చెడిపోయాడు. బహుశా పెంపకం లోపం అనుకుంటాను—...." అంది మధురనాయకి నిట్టూర్పుతూ.

"మీ కెలా తెలుసు?"

"మీ అబ్బాయి గురించి నాకు తెలిసినది చెబుతాను—వినండి!" అంటూ మధురనాయకి అతడికి పార్కులో తనకు వేణు పరిచయమయినప్పట్నించి అంతవరకూ యేం జరిగిందో చెప్పింది.

రాఘవులి ఆవేశం తగ్గింది—"వాడు చెడిపోతున్నాడు. ఎలా బాగుచేయాలో తెలియడంలేదు—" అన్నాడు దిగులుగా.

"నిదానంగా వింటే ఉపాయం నేను చెబుతాను——...."

రాఘవు లాశగా ఆమెవంక చూశాడు.

"వేణు——ఎలాంటి జులాయి పనులు చేస్తాడో మీ రూహించలేరు. అతణ్ణి అదుపు చేయడం మీవల్ల కాదు. నేనైతే అనుక్షణం అతడి ప్రవర్తన కనిపెట్టడానికో వస్తాదును నియమిస్తాను. ప్రవర్తన అదుపుతప్పినప్పుడల్లా వస్తాదు అదుపు చేస్తాడు...."

"అందువల్ల మీకు ప్రయోజనం!"

"నా యింట్లో అలివేలు అనే ఓ అమ్మాయుంది. ఆమె గురించి మీకేమీ అబద్ధం చెప్పను. అందమయిన పిల్ల. ఒకే ఒక్కసారి తప్పు చేసింది. అదీ ఓ మగాడి మాయ మాటలను నమ్మి! ఆమెకు సమాజంలో నలుగురాడవాళ్ళకు లాగా బ్రతకాల నుంది. అలాంటి అవకాశం లేకపోతే చావాలనుకుంటోంది. ఆమెను బ్రతికించాలని నా కోరిక. అది నావల్ల కాదు. మీ వల్లనే అవుతుంది——...."

"ఎలా?" అన్నాడు రాఘవులు.

"అలివేలును మీ యింట్లో పెట్టుకోండి. మీ బంధువు అమ్మాయని చెప్పుకోండి. ఆమెను వేణు కిచ్చి పెళ్ళి చేయండి. వేణు జీవితంలో నిగపడేలా నేను చూసుకుంటాను——...." అంది మధుర నాయకి.

"అలివేలుకీ మీకూ యేమిటి సంబంధం?"

"మనిషి మంచితనం కలిగించే సంబంధం!"

"బహుశా అలివేలు మీ కూతురనుకుంటాను. ఆ విషయం చెప్పుకోలేరు బయటి ప్రపంచానికి...."అన్నాడు రాఘవులు.

"నా కిద్దరు కూతుళ్ళు. గవర్నమెంటు హాస్పిటల్లో

పురుడు పోసుకున్నాను. వాళ్ళకు తండ్రెవరో చెప్పలేను కానీ తల్లిని నేనే. నేనా దానికి తిరుగులేని ఋజువులున్నాయి. వాళ్ళేం చేస్తున్నారో తెలుసా?"

రాఘవులు మాట్లాడకుండా ఆమెవంకే చూశాడు.

"నా అదృష్టంలోనే వాళ్ళిద్దరూ సగౌరవంగా వేశ్యావృత్తిని కొనసాగిస్తున్నారు. దాంపత్య జీవితం నా తత్వానికి సరిపడదు—...."

"ఇదంతా ఎందుకు చెప్పినట్టు?"

"అలివేలు నా కూతురే అయితే ఆమెను కూడా చిన్న తనం నుంచీ వేశ్యావృత్తికి అనుగుణంగా ప్రోత్సహించి ఉండేదాన్ని. నేను నమ్మిన సిద్ధాంతాన్ని, నేను ప్రయోజనం పొందుతున్న వ్యాపారాన్ని — ఇతరుల పై రుద్దే చౌకబారు స్వార్థం కాదు నాది. అలివేలును నే నాదు కున్నాను. ఆమెను బ్రతికించాలనుకుంటున్నాను...."

"కానీ తెలిసి తెలిసి.... చెడిన ఆడదాన్నెవరు చేర దీస్తారు?"

"ఒకసారి అలివేలును చూడండి అప్పుడామె గురించి మాట్లాడండి...." అంది మధుర నాయకి.

అలివేలును చూడ్డానికి రాఘవు లామె ననుసరించాడు.

ఓ గదిలో సోఫాలో కూర్చుని ఇంగ్లీషు నవల చదువుకుంటోంది ఓ యువతి. ఆమె వయసిరవై కి మించదు. ముఖంలో పసిపాపల అమాయకత్వం. బుగ్గల్లో గులాబీలో ఎర్రదనం. తనువులో విద్యుల్లత మెరుపు. చీర కట్టడంలో ఓ సొగసు. లేచి నిలబడడంలో ఓ ఆకర్షణ.

"ఈమె పేరు అలివేలు!" అంది మధుర నాయకి.

"నమస్తే!" అంది అలివేలు. అప్పుడామె పలుకరస

తళుక్కుమని మెరిసి ఎర్రని పెదాల్లో ప్రతిఫలించి— తిరిగి మూసుకుపోయింది.

"నువ్వు చదువుకోమ్మా!" అని మధురనాయకి రాఘవుల్ని బయటకు తీసుకుని వెళ్ళిపోయింది.

"ఆమె సినీనటి అయితే—జనమామె దర్శనానికి తపించిపోయేవారు. ఆమె రాజకీయాల్లో ప్రవేశిస్తే పార్టీ నాయకులామె చుట్టూ ప్రదక్షిణాలు చేస్తూండేవారు. వేశ్య అయితే ప్రతినిత్యం ఆమెకు కనకాభిషేకాలు జరిగేవి. ఆమెలో మీరిప్పుడు చెడిన ఆడదాన్ని చూస్తున్నారు. మీ మీద జాలిపడడం మినహాయించి నేనేమీ చేయలేను—" అంది మధురనాయకి.

"మీరు నిజమే చెప్పారు. కానీ ఆమె చెడిన ఆడది కాకుండా పోదుకదా!"

"మీ అబ్బాయి వేణు కూడా చెడినవాడే కదా!"

"వాడు మగాడు...."

మధురనాయకి ముఖం ఎర్రబడింది—"మీ అభిప్రాయం మార్చుకున్నాకనే మళ్ళీ ఈ గడప తొక్కండి. ప్రస్తుతానికి వెళ్ళండి—" అంది.

రాఘవులు వెంటనే—"ఈ విధంగా మా అబ్బాయి వేణు బాగుపడతాడని మీ రనుకుంటే నేను తప్పకుండా మీరు చెప్పినట్లే చేస్తాను—..." అన్నాడు.

"మంచి మనసుతో చేసిన యే పనైనా సత్ఫలితాలనే యిస్తుంది.... నేను చెప్పినట్లు చేస్తే మీ అబ్బాయి బాగుపడతాడు—...." అంది మధురనాయకి నమ్మకంగా.

4

అలివేలు రాక చుట్టుపక్కలవాళ్ళలో కొంత సంచలనాన్ని కలిగించింది. చాలామంది ఆడవాళ్ళామెను చూడ్డా

నికి వచ్చి ఆమె గురించి ఆరాలు తీశాడు. పార్వతమ్మ ఆమె నాగపురవాసులలో తనకు మేనకోడలవుతుందని—తల్లీ తండ్రీ పోగా తనింటికి తీసుకుని వచ్చాననీ చెప్పింది.

వచ్చిన మొదటిరోజే అలివేలు పార్వతమ్మ మనసు దోచుకుంది అన్ని పనుల్లోనూ ఆమెకు సాయం చేసింది. సేవలు చేసింది.

వేణు మాత్రం అలివేలువైపు కన్నెత్తి కూడా చూసేవాడు కాదు. ఇంట్లో అలివేలున్నం దతడు పెద్ద మనిషి తరహాగా మసిలేవాడు. అందుకు కారణముంది. అతడు పెద్దమనిషి తరహాగా ప్రవర్తించడం లేదని అలివేలు నుంచి ఫిర్యాదు వస్తే వేణుకు బాగా దేహశుద్ధి జరుగుతుందని మధురనాయకి ముందే బెదిరించింది.

వేణు ఇంట్లోంచి బయటకు వెళ్ళినప్పుడు తన పాత స్నేహితులతో తిరిగేవాడు. అలా రెండురోజులు జరిగేక—ఒకరోజున అతడు బార్లోకి దూరబోతుండగా—వస్తాదులాంటి మనిషి పట్టుకుని ఆపి—"ఈ ఊళ్ళో యే బార్లో నిన్ను చూసినా ముక్కలిరగదంతాను—" అని హెచ్చరించాడు. అతడప్పుడు మధురనాయకి యింటికి వెళ్ళాడు.

"ఉద్యోగం చేస్తావా, వ్యాపారం చేస్తావా?" అంది మధురనాయకి వెంటనే.

"అంటే?" అన్నాడు వేణు అర్థంకాక.

"నీకు రెండే రెండు అవకాశాలు...." అని నవ్వింది మధురనాయకి—"జులాయిగా తిరిగే అవకాశం మాత్రం నీకు లేదు—...."

"ఉద్యోగం చేస్తే మంచి జీతం దొరుకుతుందా?"

"నీ చదువుకు తగ్గ జీతమే దొరుకుతుంది....వ్యాపారం

చేస్తానంటే మా తం అది వేరే సంగతి....ఎంతైనా సంపాదించుకోవచ్చు....”

“ఏ వ్యాపారం చేయను?”

“చేస్తానంటే నేను చెబుతాను....”

“చేస్తాను ”

“అయితే వెళ్ళి బిజినెస్ మాగ్నెట్ మాధవరావును కలు. నేను చెప్పానని చెప్పు—”

వేణు మాధవరావు దగ్గరకు వెళ్ళాడు.

“ప్రెస్ ప్రారంభించు—మంచి ఆర్డర్సు వచ్చేలా చేస్తాను....” అన్నాడు మాధవరావు.

మాధవరావు, మధురనాయకిల ఆశీర్వాదంతో నెల రోజుల్లో ప్రెస్ ప్రారంభించాడు వేణు. అరికంగా మధురనాయకి. వ్యాపారపరంగా మాధవరావు అతడికి సాయపడ్డారు. ఏడాదిలోనే అతడు వ్యాపారంలో నిలదొక్కుకున్నాడు.

కొడుకులో వస్తున్న మంచి మార్పు పార్వతమ్మకు సంతోషాన్ని కలిగించింది “అంతా సన్యాసి మహిమ!” అనుకున్నదామె.

రాఘవులికీ యిప్పుడెంతో సంతోషంగా ఉంది. కొడుకు సంపాదన సామాన్యమైనది కాదు. ఇప్పుడు రాఘవులి సంపాదన చిన్నదనిపిస్తోంది.

ఒకరోజున వేణు మధురనాయకి ఇంటికి వెళ్ళి—“నాలోని మార్పు నీకు నచ్చిందా?” అన్నాడు.

“ఈ ప్రశ్న నువ్వు ఆలివేలు నడుగు....” అంది మధురనాయకి.

“ఆమెను నేను పెళ్ళి చేసుకుంటాను—....”

“అప్పుడే కాదు—....”

"ఎందుకని?"

"నువ్వు ముందు నా బాకీ తీర్చాలి!" అంది మధుర నాయకి.

"బాకీ తీర్చకుండా పెళ్ళి చేసుకోకూడదా?"

"బాకీ తీర్చడం నీ బాధ్యత. పెళ్ళి మరో బాధ్యత. ఒక బాధ్యత పూర్తి కాకుండా మరో బాధ్యతను చేపట్టడం మంచిది కాదు.... అదీకాక నేనిలా యింకా యెంతో మందికి సాయపడుతూంటాను. నాకు డబ్బవసరం. నా డబ్బు నీవంటి వారికద్ద చిక్కుపడిపోకూడదు" అంది మధుర నాయకి.

5

"అలివేలు చాలా మంచిపిల్ల. మనింట్లో పాదం పెట్టినప్పట్నించీ అన్నీ లాభాలే!" అంది పార్వతమ్మ.

"అవును — యే యింటి కోడలవుతుందో —.... వాళ్ళు చాలా అదృష్టవంతురాలు—...." అన్నాడు రాఘవులు.

"మనిల్లుండగా—యే యింటికో యెందుకు వెడుతుంది?" అంది పార్వతమ్మ ఆశ్చర్యపోయి.

"బాగుంది—కులం, గోత్రం తెలియని పిల్లను మనింటి కోడలు చేసుకుంటామేమిటి....?" అన్నాడు రాఘవులు

"అయితే మాత్రం—మనింటి కోడలు చేసుకుందామనే కదా—మీరా అమ్మాయిని తెచ్చారు? నాకు నచ్చితే మనవాడికిచ్చి పెళ్ళి చేద్దామని కూడా అన్నారు. అలివేలు నాకెంత నచ్చిందో మాటల్లో చెప్పలేను...." అంది పార్వతమ్మ.

"అయితే యిన్నాళ్ళూ దాచిన అసలు విషయం

కూడా చెబుతాను. ఆ పిల్ల మంచిది కాదు. చెడి పోయింది. వేరే దారిలేక మనింట్లో పెట్టాను——....”
అంటూ రాఘవు లప్పుడామె అసలు విషయం వివరించి చెప్పాడు.

పార్వతమ్మ వెంటనే....——“ఛీ ఛీ ఛీ....యెంత మోసం!” అంది.

“అలవే లెలాంటిదో తెలిస్తే నువ్వామె నింట్లో వుంచుకుందు కంగీకరించవు. అందుకని నేనామె గురించిన కొంత నిజాన్ని దాచిపెట్టి మనింటికి తెచ్చాను. అప్పు డంతకుమించి వేరే దారిలేదు మనకి....”

“ఇప్పుడేం చేయాలి?” అంది పార్వతమ్మ.

“మంచి సంబంధాలొస్తున్నాయి మనవాడికి. కట్నం కూడా యాభై వేలకు తక్కువొచ్చేలా లేదు. మన మెలాగో అలా ఈ పిల్లను వదుల్చుకోవాలి....——”

“ఎలా వదుల్చుకుంటాం?” అంది పార్వతమ్మ కంగారుగా.

“ముందు మనవాడికా పిల్లమీద యెలాంటి అభి ప్రాయముందో తెలుసుకో!” అన్నాడు రాఘవులు.

“వాడెప్పుడూ పొరపాటున కూడా ఆ పిల్ల వంక కన్నెత్తి చూడడండీ——బహుశా వాడి కిష్టం లేదను కుంటాను——....” అంది పార్వతమ్మ.

“అలా కాదు—ముందుగా అడిగి తెలుసుకో. వాడి కిష్టం లేకపోతే మన పని సగానికి సగం సులభమవు తుంది——....” అన్నాడు రాఘవులు.

ఆ రాత్రి పార్వతమ్మ యథాలాపంగా కొడుకు దగ్గర కెళ్ళి ప్రసక్తి తీసుకువచ్చింది.

“నా పెళ్ళికింకా ఆగాలమ్మా—వ్యాపారంలో మరి

కాస్త నిలదొక్కుకోవాలి—"

"అదిసరే— పెళ్ళి కలాగూ అగొచ్చు. ఈలోగా పెళ్ళిచూపులకంటూ వెళ్ళడంలో తప్పులేదు. చాలామంది మనమీద ఒత్తిడి తీసుకుని వస్తున్నారు...."

వేణు ఆశ్చర్యంగా—"ఇంకా నాకు పెళ్ళిచూపు లేమిటి? నేను పెళ్ళిచేసుకునే అమ్మాయి అలివేలేకదా!" అన్నాడు.

పార్వతమ్మ ఆశ్చర్యంగా "నువ్వు అలివేలును పెళ్ళి చేసుకుంటావా? నే నిది ఊహించలేదు—" అంది.

"ఇందులో ఆశ్చర్యమేముంది? అంతా అనుకున్నదేగా?" అన్నాడు వేణు.

"అలివేలు చెడిపోయిన పిల్లని నీకు తెలియదా?"

"ప్రతి మనిషీ తప్పులు చేస్తాడు. నేనూ కొన్ని తప్పులు చేశాను. ఇప్పుడు నేను బాగుపడ్డాను. అయినా ఇప్పటికీ పాత విషయాలు గుర్తుచేస్తూ నన్నెవరైనా చెడిపోయినవాడని అంటే నేను భరించలేనమ్మా—" అన్నాడు వేణు.

"అలివేలు బాగుపడిందని నమ్మక మేమిటి?" అంది పార్వతమ్మ.

"అందుకు తిరుగులేని ఋజువొకటుంది—" అన్నాడు వేణు.

"ఏమిటది?—...." అంది పార్వతమ్మ కుతూహలంగా.

"అలివేలీ యింట్లో అడుగుపెట్టి యేడాది దాటింది. ఎప్పుడూ ఆమెను మెచ్చుకోవడం తప్ప వేలెత్తి చూపలేదు నువ్వు. అంతగా నీ అభిమానం పొందిన ఆమె ప్రవర్తనను నా బోటివా డెక్కడ శంకించగలడు?" అన్నాడు

వేణు.

పార్వతమ్మకు బదులేం చెప్పాలో తెలియలేదు. అప్పట్లో ఆమెకు అలివేలు గురించిన అసలు కథ తెలియదు.

వేణు చటుక్కున పార్వతమ్మకు పాదాభివందనం చేశాడు.

"ఏమిట్రా యిది!" అంటూ కొడుకును లేవనెత్తింది పార్వతమ్మ.

"నిన్ను చూస్తే నాకెంతో సంతోషంగా వుందమ్మా!" అన్నాడు వేణు.

"ఎందుకని?"

"మధురవాయకి అనే ఆమె వేశ్యగానే ఈ ఊళ్ళో చాలామందికి తెలువు. కానీ సమాజానికి ఆమె చేస్తున్న సేవ ఉదాత్తభక్తికి సంబంధించినది. అందానికి అప్సరస అయిన అలివేలును తన స్వార్థానికి కూడా ఉపయోగించుకోకుండా—ఆమె కోసం నన్ను కూడా బాగుచేయాలని సంకల్పించి ఫలితం సాధించిందామె. సంప్రదాయాల కనుగుణంగా జీవిస్తూన్న నీవు—చెడును కొడుకు రూపంలో కూడా భరించలేక ఇంట్లోంచి బయటకు గెంటినప్పుడు—నువ్వు—నా కన్నతల్లివైన నువ్వు మధురవాయకి కాలి గోటికి కూడా సరిపోలని వ్యక్తివైనందుకు నా కెంతో బాధ కలిగింది.

అయితే చెడిపోయిన ఆడదని తెలిసి కూడా అలివేలును యేడాది నుంచి కన్నబిడ్డలా ఆదరించి అభిమానించ గలుగుతున్న నువ్వు—ఆ మధురవాయకి కంటె యెన్నో రెట్లు గొప్పదానివి. ఎందుకంటే మూఢనమ్మకాలతో, సంప్రదాయపు వాసనలతో, సదాచారాలనబడే

అనాచారాలతో-ప్రాణంలో ప్రాణంగా పెరిగిన మనిషివి నువ్వు. నీలో యింతటి విశాలహృదయం అపూర్వం—" అన్నాడు వేణు.

కన్నకొడుకులో ఇంతటి ఆలోచనాశక్తి ఉన్నదని తెలియని పార్వతమ్మ ఆశ్చర్యంగా అతడికంకే చూస్తూండి పోయింది. అయితే అతడి పొగడ్తలామెకు సంతోషాన్ని మాత్రం కలిగించలేదు.

6

"అబ్బాయి మా పిల్లంటే చాలా మోజులో వున్నాడు. వాడిలో యిప్పుడు మంచి మార్పు వచ్చినట్లనిపిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఈ పెళ్ళి జరిపించడమే మంచిదేమో—లేకుంటే మనసు పాడై మళ్ళీ పాత బుద్ధులు వచ్చేస్తాయేమో మన వేణుకి—" అంది పార్వతమ్మ.

"అలాంటి భయాలేం పెట్టుకోకు. అయినింటి సంబంధాలు క్యూలో నిలబడి వుంటే అలవేలులాంటి పిల్లను చేసుకునే కర్మ మనకేం పట్టిందీ—" అన్నాడు రాఘవులు.

"అయితే మనమిప్పుడేం చేయాలి?"

"అబ్బాయి మనసా పిల్లమీద పూర్తిగా విరిగి పోవాలి—"

"అదెలా సాధ్యం?"

"నువ్వు వాడికి నచ్చచెప్పు—ఆ పిల్ల బుద్ధి మంచిది కాదని!"

"చెబుతాను. కానీ వాడది నమ్మొద్దూ?"

రాఘవులు కాసేపాలోంచి—"అలివేలుని సుందర్రాజు దగ్గరికి సంగీతానికి పంపించు—" అన్నాడు.

"సుందర్రాజా—....వాడి కసలే మంచి పేరు

లేదు—"

"మంచి పేరు లేదు కాబట్టే?!" అన్నాడు రాఘవులు.

భర్త ఆలోచన పార్వతమ్మకు కొంతవరకూ అవగతమయింది.

సుందర్రాజు సంగీత మేస్టరు. బాగా పాడతాడని పేరు. కాని ఆడపిల్లలను చూస్తూ కూర్చోలేడు. బుద్ధి గడ్డితింటూనే ఉంది—యెంతమంది గడ్డి పెట్టినప్పటికీ కూడా! చూసి చూసి యెవరూ ఆడపిల్లల్నతడి దగ్గరకు పంపించరు.

"అలివేలు ఒప్పుకుంటుందా?"

"అమ్మాయికి సంగీతమంటే యిష్టమని చెప్పు!" అన్నాడు రాఘవులు—"సుందర్రాజు గురించి ఆమెకెలాగూ తెలియదు—...."

"సరే—సంగీతానికి వెళుతుంది—అప్పుడు?" అంది పార్వతమ్మ.

"ఆ సంగతి నేను చూసుకుంటాను—" అన్నాడు రాఘవులు.

పార్వతమ్మ అలివేలు దగ్గర కెళ్ళింది.

రాఘవులు సుందర్రాజు దగ్గర కెళ్ళాడు.

"సుందర్రాజా! మా యింట్లో అలివేలని ఓ అమ్మాయుంది. మూరపుటంఘువు లమ్మాయి. మెరుపుతీగలా వుంటుంది. అద్భుతమయిన గొంతు. నీకు శిష్యురాలిని చేయాలని నా కోరిక యెందుకో తెలుసా?" అన్నాడు రాఘవులు.

"ఎందుకు?"

"నువ్వామెను పెళ్ళి చేసుకుంటే ఈడూ జోడూ

బాగుంటుంది. ఇద్దరూ ఉమ్మడి కచేరీలు చేసి లక్షలార్జించవచ్చు—....” అన్నాడు రాఘవులు.

అందమయిన పిల్లను పెళ్ళాడి—ఆ పిల్లకు సంగీతం నేర్పి—ఆమెద్వారా లక్షలార్జించాలన్న కోర్కె సుందర్రాజుకు వయసొచ్చినప్పట్నించీ వుంది. అతడి వయసిప్పుడు ముప్పై. ఇంతవరకూ యే అందగత్తే అతణ్ని కరుణించలేదు.

“ఆ అమ్మాయి నన్ను పెళ్ళి చేసుకుంటుందా?”

“అంత సులభంగా ఒప్పుకోదు. ప్రస్తుతానికి మా వాడిమీద కన్నేసింది. ఆ పిల్ల అందానికి లొంగిపోతాడేమో మా వాడని భయం. నీ దగ్గరికి పాఠాలకు పంపిస్తాను. నువ్వామెను వశపర్చుకోగలిగితే నీకే యిచ్చి పెళ్ళి చేస్తాను—....”

“ఓహో—అదన్న మాట కథ!”

“నీ కిష్టం లేదంటే చెప్పు. అలివేలుకు వేరే సంబంధం చూడగలను ...”

“నా దగ్గరకు పంపించండి. మీ కింక వేరే సంబంధం చూడాల్సిన అవసరముండదు—” అన్నాడు సుందర్రాజు.

ఇలాంటి ప్రోత్సాహమేమీ లేకుండానే సుందర్రాజు మనసు చెడ్డది. రాఘవు అగ్నికి ఆజ్యం పోశాడు.

పార్వతమ్మ అలివేలును సుందర్రాజు దగ్గర సంగీతం నేర్చుకొనేందుకు ఒప్పించింది. అలివే లతడికద్దకు సంగీతానికి వెళ్ళనారంభించింది.

7

సుందర్రాజు అలివేలుతో మొదటి రోజుల్లో జాగ్రత్తగా వున్నాడు. ఆమె అందం మాత్రం అతడికి వెర్ర

తించింది. రెండోసారి జాతకం పేరు చెప్పి తన చేతుల్ని ఆమె తొడలపై వేశాడు. మృదువుగా ఆమె తొలగించింది. క్రమంగా జాతకాల అర్థాలు వివరిస్తూ చనువు పెంచసాగాడు.

"మేస్టారూ — మీ వరస బాగోలేదు....” అంది అలివేలు కోపాన.

"అది నేను కట్టిన వరస కాదు — అన్నమయ్యది —” అన్నాడు సుందర్రాజు.

"నేను చెబుతున్నది మీ వరస గురించి —”

"ఏ వరస?” అన్నాడతడేమీ ఎరుగనట్లు.

"మీ ప్రవర్తన బాగోలేదు —....”

"నేనేం చేశాను?”

బదులివ్వకుండా కోపంగా అతడివంక చూసింది అలివేలు.

"ఏం చేశానో చెప్పు —” అన్నాడు సుందర్రాజు.

"మీకే తెలుసు —....”

"తెలిసినా సరే — నీ నోట వింటే బాగుంటుంది....”

సుందర్రాజు ధైర్యానికి అలివేలు ఆశ్చర్యపడింది. తానతడి ప్రవర్తనకు అభ్యంతరం చెప్పింది. అతడేం చేశాడో తన నోట వినాలనుకుంటున్నాడు.

ఆమె మౌనం వహిస్తే అలుసుగా తీసుకుని సుందర్రాజామె భుజం చుట్టూ చేయి వేశాడు.

"వదులు —” అంది అలివేలు.

"వదలను —” అన్నాడు సుందర్రాజు.

ఆమె విదిలించుకోబోయింది. అతడామె కంటె బలవంతుడు.

ఆమె తిట్టింది. అతడామెకంటే మొండివాడు.

"ఇది చాలా అన్యాయం—" అందామె అసహాయంగా.

"నువ్వు నాకు సహకరిస్తే ఏ అన్యాయం జరగదు-" అన్నాడు సుందర్రాజు.

"అంటే?"

"నేను నిన్ను పెళ్ళి చేసుకుంటాను—...."

"ఈ మాట ముందే చెప్పాల్సింది. నీలాంటి సంగీత విద్వాంసుణ్ణి పెళ్ళి చేసుకొనే అవకాశం నా అదృష్టంగా భావిస్తాను—" అంది అలివేలు.

సుందర్రాజు ముఖం వికసించింది — "ముందుగా చెప్పలేకపోవడం నా పొరపాటే?" అన్నాడు.

"ఈ రోజుకు నన్ను వదిలిపెట్టు పెద్దలు అనుమతిస్తే మనం గుళ్ళో పెళ్ళి చేసుకుందాం. పెళ్ళికి ముందిలా నాకు నచ్చదు—...."

"పెద్దల అనుమతి గురించి నువ్వు బెంగపడకు. రాఘవులు మన పక్షమే!" అన్నాడు సుందర్రాజు.

"నీకెలా తెలుసు?"

"నిన్నాయన నా దగ్గరకు సంగీతానికి పంపినందుకు కనుకున్నావ్?"

అలివేలుకు క్షణంలో అంతా అర్థమయింది అయితే ఆమె బయటపడకుండా—"మాటమాత్రంగా విషయమింట్లో చెప్పడం నాకు మర్యాద! నన్నాదరించినవారి ఆశీర్వాదం పొందకుండా యే నిర్ణయం తీసుకోలే —" అంది.

సుందర్రాజామె మాటలు నమ్మాడు. ఆరోజుకామెను వదిలిపెట్టాడు.

8

ఇట్లు చేరుకున్నారు అలివేలు బాగా ఆలోచించింది. విషయాన్ని వేణుద్వారా వెళ్ళనివ్వకూడదని ఆమె అనుకొంది. అందుకే ఫోన్‌లో మధురనాయకికి జరిగింది చెప్పింది.

మధురనాయకి మనుషుల్ని పంపించింది. సుందర్రాజుకు దేహశుద్ధి జరిగింది. ఇంకోసారి అలివేలు జోలికి వెడితే ప్రాణాలు కూడా దక్కవన్న హెచ్చరిక కూడా అందింది.

సుందర్రాజు రాఘవులికి చెప్పుకొని లబోదిబోమన్నాడు. ఏం జరిగివుంటుందో రాఘవు లూహించాడు.

"నవ్వో పని చేయి. తన ప్రియుణ్ని కలుసుకుందుకు అలివేలు నీ ఇల్లు ఎన్నుకుందనీ—నువ్వది కొనసాగనివ్వక పోతే ఆమె ప్రియుడు నిన్ను చావకొడతాన్నాడనీ వేణుకు చెప్పు."

"అందువల్ల నాకేం ప్రయోజనం?"

"ఏమిటూ? అలివేలు ఆశలన్నీ మావాడిమీదే—నువ్వాదారి మూసేయాలి. అప్పుడామెకు నువ్వు తప్ప వేరే దిక్కుండదు—...."

సుందర్రాజుకీ పథకం నచ్చింది. అతడు రాఘవులు చెప్పినట్లే చేశాడు. అతడు చెప్పింది విని వేణు ఆశ్చర్యపడ్డాడు. అయితే అతడు తొందరపడకుండా నిదానించాడు. ముందుగా మధురనాయకిని కలుసుకొని అలివేలు బుద్ధి మంచిది కాదన్నాడు.

మధురనాయకి అతడు చెప్పింది విని — "అసలు జరిగింది తెలిస్తే నువ్వాశ్చర్యపడతావు. మీ నాన్నకు అలివేలు నీ భార్య కావడం ఇష్టంలేదు...." అంటూ జరిగింది వివరంగా చెప్పింది.

"అలివేలు చేసిన తప్పేమిటి?" అన్నాడు వేణు ఆశ్చర్యంగా.

"చెడిన ఆడది—"

"నాకు లేని అభ్యంతరం మా నాన్నకెందుకు?"

"మీ నాన్న పెంపకంలో నువ్వు ఇరవై యేళ్ళకు పైగా పెరిగావు. ఆ పెంపకం నిన్నెలా తీర్చిదిద్దిందో నీకు తెలుసు. కొద్దిరోజుల పరిచయంతో నేను నిన్నెంత ఎత్తుకు తీసుకొనిపోయానో నీకు తెలుసు. మీ నాన్నకు నావంటి స్నేహితులు లేక సంస్కారంలో యెదగలేక పోతున్నాడు—" అంది మధురనాయకి నిరసనగా.

"నీకు భయంలేదు. నాన్న నెగ్గిరించినా సరే— నేను అలివేలును పెళ్ళిచేసుకుంటాను—" అన్నాడు వేణు.

"అలాగే— కానీ ముందు నా బాకీ తీర్చినాక నే నీ పెళ్ళి— ఈ విషయం మర్చిపోకు—" అంది మధుర నాయకి.

వేణు నిట్టూర్చి ఊరుకున్నాడు.

"దిగులుపడకు. నువ్వు అలివేలునోకంట కనిపెట్టి కాపాడుకుంటూండు. నీవల్లకాని పనుంటే నా దగ్గరకు రా!" అంది మధురనాయకి.

9

"ఎవరూ?" అన్నాడు రాఘవులు.

ఇంట్లో ఆయనొక్కడే వున్నాడు. పార్వతమ్మ పొరుగింటికి వెళ్ళింది. ఆ రోజాయన ఆఫీసుకు సెలవు. వేణు మాత్రం ప్రెస్ పనిమీద బయటే తిరుగుతున్నాడు.

వంటువంటూ లోపలకు వచ్చింది అలివేలు.

"ఏమయింది?" అన్నాడు రాఘవులు.

అలివేలు ఆయన దరిదాపుల్లో మసలడం అరుదుగా

జరిగేది. ఆమె యెప్పుడూ పార్వతమ్మవంటి పెట్టుకొని తిరిగేది. అరుదుగా రాఘవులు కళ్ళపడడం జరిగేది.

"కాలిలో ముల్లు దిగింది మామయ్యా!" అంది అలివేలు.

పిన్నీసుతో ఆమె పాదాల్లో ముల్లును వెతకడానికి ప్రయత్నించిన రాఘవులికప్పుడు హృదయంలో యేదో ముల్లు గుచ్చుకుంది. తను భ్రమపడుతున్నాడో నిజంగా జరుగుతోందో తెలియదు కానీ అమాయకంగా నటిస్తూనే రాఘవుల్ని రెచ్చగొట్టింది అలివేలు.

ఆగోజాకది ప్రారంభం మాత్రమే!

క్రమంగా రాఘవులలో అలివేలుపట్ల మోజు కలిగింది. పెరిగింది. ఆమెనతను స్త్రీగా గుర్తించాడు. ఆ గుర్తింపతడిలో కొత్త కోర్కెలు చిగురింపజేసింది.

చివరకు వీలున్నప్పుడల్లా ఆయన కాస్త చనువు చూపించసాగాడు.

అలివేలు ఆయన్ను ప్రోత్సహించిందే తప్ప నిరుత్సాహపర్చలేదు.

జగన్మోహినీ అవతారానికి పరమశివుడు చలించి పోయాడు. భస్మాసురుడు భస్మమయ్యాడు. రాక్షసు లమృతాన్నే వదులుకున్నారు.

రాఘవులకి వావివరుసలు గుర్తుంటాయా?

ఆయన తన మనసులోని తప్పును గుర్తించడానికి బదులు—అలివేలు గత జీవితంలోని తప్పును వెదక సాగాడు.

అలా వారంరోజులు గడిచేసరికి ఒకరోజున ఆయన అలివేలుతో—"నువ్వు చాలా అందగత్తెవి-" అన్నాడు.

"నా సంగతి నువ్వు చెప్పావు. నీ సంగతి నేను

చెప్పనా?" అంది అలివేలు.

"ఊఁ" అన్నాడు రాఘవులు.

"వేణుకి నువ్వు తండ్రిలాకాక అన్నయ్యలా కని పిస్తావు—" అంది అలివేలు.

అప్రయత్నంగా రాఘవులు చేయి తన గుబురుమీసాల పైకి వెళ్ళింది.

"చెప్పాలంటే నాకు నువ్వంటేనే యిష్టం—" అంది అలివేలు.

రాఘవులు తెల్లబోయాడు.

"అత్తయ్యొప్పుకుంటే నాకు నిన్ను రెండో పెళ్ళి చేసు కోవాలనుంది—...."

రాఘవులుచితానుచితాలు మరచి, విచక్షణా జ్ఞానాన్ని కోల్పోయి అలవేలును కౌగలించుకొన్నాడు. ఆమె అతణ్ణి మృదువుగా విదుల్చుకొని — "ఇదికాదు సమయం!" అంది.

"మరెప్పుడు?"

"ఈ రాత్రికి...." అంది అలివేలు.

"నువ్వు నిజంగా నన్ను ప్రేమిస్తున్నావా?" అన్నాడు రాఘవులు.

"ఊఁ."

"ఎందుకని?"

"నీ కొడుకు వేణు గతం మంచిదికాదు. అతడంటే నాకు అసహ్యం. నువ్వెంతో మంచివాడివి. ఉన్నతుడివి. నీవంటి వాడికిల్లాలినైతే ఇహమూ, పరమూను...."

10

ప్రెస్‌నుంచి తిన్నగా పార్కుకు వెళ్ళాడు వేణు. అప్పుడక్కడ అలివేలు యెదురుచూస్తూ వుంది.

"ఆలస్యం చేశానా?" అన్నాడు వేణు.

"నా మనసుకు ఆలస్యం. వాచీ ప్రకారం కాదు-...."

"ఏమిటో చెప్పాలన్నావు?"

"ఇన్నాళ్ళూ దాచిన నిజమొకటి బయటపెట్టాలనుకుంటున్నాను—"

"ఏమిటది?"

"మధురనాయకి మీ నాన్న గురించి చెప్పిన విశేషం నువ్వు నాకు చెప్పావు. అప్పుడే నేను నీకు నిజం చెప్పేయాల్సింది—" అంది అలివేలు.

"ఏమిటది?"

"చాలాకాలంగా మీ నాన్న నా వెంట బడుతున్నాడు—"

వేణు తెల్లబోయి—"ఏమిటీ?" అన్నాడు.

అలివేలతడికి క్లుప్తంగా రాఘవులు ప్రవర్తన గురించి చెప్పింది.

"మా నాన్న అలాంటివాడంటే నమ్మలేను—" అన్నాడు వేణు.

"అందుకే చెప్పడానికి తటపటాయిస్తున్నాను. మగాళ్ళంతా ఇంతే!"

"ఇన్నాళ్ళూ ఆగి—ఇప్పుడే యెందుకు చెప్పావు?" అన్నాడు వేణు అనుమానంగా ఆమె వంక చూస్తూ.

"ఎందుకంటే ఈ రాత్రికి మీ నాన్న నాకు శోభనం ముహూర్తం పెట్టాడు కనుక!"

"ఏమిటీ?"

అలివేలు అదోలా నవ్వి ఊరుకుంది.

"ఛీ....ఛీ...." అన్నాడు వేణు.

ఆమె మాట్లాడకుండా అతడి వంకే చూసింది.

"నువ్వేమన్నావు?"

"ఏం చేయాలో తెలియక—ఇప్పుడు నీకు చెప్పుకొంటున్నాను...."

"అమ్మకు తెలుసా?"

"ఆ తర్వాత తెలిసినా చూసీ చూడనట్లూరుకుంటుంది. ఏదోవిధంగా నీకూ నాకూ పెళ్ళి తప్పిపోవాలన్నది—ఆమె కోరిక!"

"ఛీ.. ఛీ...."అన్నాడు వేణు.

"నావల్ల తప్పు జరిగిందని మీ ఇట్లో నేనంటే చిన్న చూపు. నేనైతే వయసులో వున్న ఆడపిల్లను. పెళ్ళి పేరు చెబితే మోసపోగలను. కానీ మీ నాన్నకేమవసరం? ఆయనెందుకు తప్పు చేయాలనుకుంటున్నాడు?"

"ఆయనకు తెలుసు—నేను నిన్ను పెళ్ళి చేసుకొంటానని! కొడుకు భార్య కూతురితో సమానం...! మన పెళ్ళి చెడగొట్టడానికే అయినా—ఆయన యెన్నుకొన్న పద్ధతి జుగుప్సాకరంగా వుంది. అడిగిన వెంటనే నువ్వాయన్ను సాచి లెంపకాయ కొట్టవలసింది—" అన్నాడు వేణు.

"అలా కొడితే నామాటెవరు నమ్ముతారు? అందరి దృష్టిలోనూ నేను చెడిన ఆడదాన్ని. మీ నాన్న మర్యాదస్తుడు. నేనే యేదో చేశానంటారు. అందరూ యేమనుకొన్నా నీ దృష్టిలో నేను చెడ్డదాన్ని కాకూడదు. అందుకే మీ నాన్నను నా గదికి ఆహ్వానించానీ రాత్రికి."

వేణు తెల్లబోయి— "నువ్వేదైనా నాటకమాడుతున్నావా?" అన్నాడు.

"నాటకం నాదే అనుకో! రాత్రి మీ నాన్న గదికి వచ్చి నాతో సరససల్లాపాలు మొదలెడితే అందులో ఆయన తప్పుందంటావా లేదా? సిగ్గులేక నేను పిలిచా

ననుతో ఆ వెనుపోటునే అంగీకరించడమేనా? ఆయన సంస్కారం?"

"ఐయామ్ సారీ అలివేలూ! నువ్వాయన్ని పిలుస్తావని నేననుకోను. ఆయన నీ గదికి వచ్చి తప్పుగా ప్రవర్తిస్తే- ఆ తప్పంతా పూర్తిగా ఆయనదే! అసలే నేనా వేళ పగుణ్ణి ... ఆ సమయంలో నేనేం చేస్తానో నాకే తెలియదు ...."

"ఈ రాత్రి ముందుగానే నా గదికి వచ్చి మంచం కింద దాక్కో. ఏం జరుగుతుందో గమనించు. తర్వాత నేనేం చేయాలో సలహా ఇవ్వు ...." అంది అలివేలు.

అప్పుడే వేణు పిడికిళ్ళు బిగుసుకోవడం అలివేలు గమనించింది.

11

ఆ రాత్రి ఉక్కగా వుందని తన మంచం పెరట్లో వేయించుకొన్నాడు రాఘవులు. తనతో పాటు సాయంగా వుంటుందని పార్వతమ్మ మంచం కూడా పెరట్లో వేయించాడు.

సాధారణంగా పార్వతమ్మ, అలివేలు — ఓ గదిలో పందిరి మంచంమీద పడుకొంటారు. ఆ రాత్రికి అలివేలు మాత్రమే పందిరి మంచంమీద పడుకుంది.

భార్యకూ, కొడుక్కూ మంచినీళ్ళలో నిద్రమాత్రలు కలిపిచ్చాడు రాఘవులు తండ్రిని వేయి కళ్ళతో కనిపెడుతున్న వేణు తనుమాత్రం ఆ మంచినీళ్ళు తాగలేదు. అతడు పెరట్లో పడుకొనేందుకూ అంగీకరించలేదు. పందిరి మంచం గదివానికొనే వున్న గదిలో పడుకుంటానన్నాడు. తను నిద్రమాత్రల నీళ్ళు తాగితే తండ్రిని భ్రమపెట్టి నిద్ర నటించుకుంటానని తన గదికి వెళ్ళి— అక్కణ్ణుంచి పందిరి మంచం గదిలోనికి వచ్చి మంచం

క్రింద కూర్చున్నాడు.

భాగ్యతమ్మ నిద్రకు పడగానే రాఘవులు లోపలకు వచ్చాడు. ఉత్సాహంగా అలివేలుతో కబుర్లు ప్రారంభించాడు. అలివేలు నర్మగర్భంగా మాట్లాడుతూంటే తను మాత్రం సరసభాషణలు మొదలెట్టాడు.

అతడి చనువు పెరుగుతోంది.

అలివేలు అభ్యంతర పెడుతోంది.

రాఘవులు తన గొప్పతనాన్ని వర్ణిస్తున్నాడు. ఆ వర్ణనలో అసభ్య పదజాలాలు దొర్లుతున్నాయి. తన కొడుకును కించపరుస్తున్నాడు. వాడు నీకు తగ్గవాడు కాదు — నేనే నీకు తగినవాణ్ని అంటున్నాడు.

రాఘవు లప్పుడు నిషాలో ఉన్నాడు. అలివేలిచ్చిన ప్రోత్సాహపు నిషా అది! అలివేలును చూస్తున్న నిషా అది! అలివేలుపై కోర్కె పుట్టించిన నిషా అది!

అతడి నిషా అతడి మాటలను, చేతలను అదుపు తప్పిస్తోంది. ఓ స్థితికి వచ్చేక అలివేలు ప్రతిఘటించడం మొదలెట్టింది. రాఘవులు బలం చూపించసాగాడు. ఆ వయసులో కూడా అతడి బలం అలివేలు బలాన్ని మించింది.

వేణులో ఆవేశం పెరిగింది. మంచంకింద చిన్న ట్రంకు పెట్టె వుంది. దాన్నతడు కసిగా బయటకొక తోపు తోశాడు.

చప్పుడుకు రాఘవు లులిక్కిపడి లేచాడు.

అలివేలు మంచం దిగి బట్టలు సవరించుకుంది.

వేణు మంచం కిందనుంచి బయటకు వచ్చి లేచి నిలబడి తండ్రిని పట్టుకుని కుదుపుతూ — "నువ్వు మనిషివి

కాదు. రాక్షసుడివి— ....” అన్నాడు.

“నువ్విక్కడి కెలా వచ్చావ్?” అన్నాడు రాఘవులు తెల్లబోతూ.

“ఎలాగో వచ్చాను....నీవు నీ వయసు గుర్తుందా? వావివరుసలు గుర్తున్నాయా?” అన్నాడు వేణు.

అలివేలు అక్కణ్నించి వెనక్కి వెళ్ళింది. మంచం కింద నుంచి నూటిగా వెళ్ళి గోడకు తగుల్కున్న చిన్న ట్రంకు మూతవిడి వుంది. ఆమె పెట్టిని సరిచేస్తూ లోపలి గుడ్డలనోసారి విదిపింది.

ఖంగుమన్న శబ్దమైంది.

పనసకాయ కత్తి ఒకటి నేలమీద పడిన శబ్దమది!

వేణు వెనక్కి తిరిగి ఆ కత్తిని చూశాడు.

“ఇందులో నా తప్పేమీ లేదు. ఈ అలివేలు వలట.... ఇదే నన్ను ప్రోత్సహించి గదిలోకి రప్పించుకుంది....” అన్నాడు రాఘవులు తడబడుతూ.

“ఛీ....అది రమ్మంటే మాత్రం నీ బుద్ధేమయింది?”

అలివేలు ఆ తండ్రీ కొడుకులను....పనసకాయ కత్తిని మార్చి మార్చి చూస్తోంది. వేణు ఆమె నుద్దేశించి— “అలివేలూ! అమ్మను పిల్చుకుని రా! ఈ నీతిపరుడి అసలు రంగు బయట పెడతాను....” అన్నాడు.

అలివేలు గదిలోంచి బయటకు వెళ్ళింది. ఆమె పార్వతమ్మను నిద్రలేపుతూండగా హృదయవిదారకమైన ఆర్తనాదం ఒకటి వినబడింది.

12

“శభాష్ అలివేలూ!” అంది మధుర నాయకి.

ఆ గదిలో ఆమె, అలివేలు కాక—మరో వ్యక్తి

వున్నాడు. అతడు కాషాయాంబరాలు ధరించి ఉన్నాడు.

“ఇందులో నేను చేసిందేమీ లేదు. అంతా మీరు చెప్పినట్లు జరిగింది—” అంది అలివేలు మధురనాయకి వంక చూస్తూ.

కాషాయాంబరధారి అలివేలువంకే చూస్తూ—“నాకిద్దరు చెల్లెళ్ళు ఇద్దరూ చదువులకు సరస్వతులు. అందంలో దేవకన్యలు. అమ్మా నాన్నా లేని కారణంగా వాళ్ళను నా ప్రాణంగా పెంచాను. ఎలా పడ్డారో వాళ్ళిద్దరూ రాఘవులు పన్నిన ఉచ్చులో పడ్డారు. ఒకరికి తెలియకుండా ఒకరిని గుళ్ళో దొంగపెళ్ళి చేసుకున్నాడు రాఘవులు. సమయం వచ్చేదాకా పెళ్ళి విషయం రహస్యంగా ఉంచాలన్నాడు.

ఇలాంటి రహస్యమెంతో కాలం దాగదు. వాళ్ళిద్దరూ గర్భవతులయ్యారు. ఇద్దరికీ భర్త ఒకడేనని తెలిసేక చెల్లెలి కోసం అక్క ప్రాణాలు తీసుకుని త్యాగం చేసింది. అప్పుడు రాఘవులు తనకు అప్పటికే పెళ్ళయిందనీ—నా చెల్లెలి గురించి తనకేమీ తెలియదనీ చెప్పాడు. ఆమె కూడా ఆత్మహత్య చేసుకుంటున్నట్లు చీటీ రాసి నన్ను వదిలి వెళ్ళిపోయింది.

వాళ్ళిద్దరూ మోసపోయారని తెలుసుగానీ ఎవరివల్ల మోసపోయారో నాకు తెలియదు. జీవితమంటే విరక్తి పుట్టింది. ప్రాణాలు నిలబెట్టుకునేందుకు బ్రతుకుతూ, బ్రతకడానికి ప్రాణాలు నిలబెట్టుకుంటూ రోజులు గడుపుతున్న నాకు—అనుకోకుండా నా రెండో చెల్లి దర్శనమయిందిక్కడ. ఆమెను మధురనాయకి రక్షించి బ్రతికిం

చిందని తెలిసి సంతోషించాలో యేడ్వాలో అర్థం కాలేదు.

మధుర నాయకి నా కథ విని రాఘవులుకి బుద్ధి చెప్పాలంది. నా చెల్లి ద్వారా నాకు రాఘవులు ఆచూకీ తెలిసింది. రాఘవులి కెలా బుద్ధి చెప్పాలా అని ఆలోచిస్తూండగా వేణు మధురనాయకి యింట్లో ప్రవేశించాడు. అప్పుడు నేను పార్వతమ్మ యింట్లో సన్యాసినిగా ప్రవేశించాను. నాకు వచ్చిన హిప్నాటిజంతో నాలో మహిమ లున్నట్లామెను భ్రమ పెట్టాను. చెడిన ఆడదిగా నువ్వు రాఘవులింట్లో ప్రవేశించావు. వేణు బాగుపడ్డాడు. రాఘవులి అసలు రంగు బయటపడింది...."

మధుర నాయకి నిట్టూర్చి—"మోసపోయిన ఆడపిల్లలు ఆత్మహత్యలు మాని—హత్యలు చేయాలి. అప్పుడే మగాడిలో భయం పుడుతుంది. ఈ ప్రపంచంలో నే నెవరినైనా క్షమించగలను కానీ స్త్రీని మోసం చేయాలనుకున్నవాడిని క్షమించలేను. అలాంటి వాళ్ళను వెతికి వెతికి వేటాడాలన్నది నా శపథం!" అంది.

"చెడిపోయిన కొడుకు బాగుపడ్డాడు. బాగుపడిన తండ్రి చెడిపోయాడు. చెడి బాగుపడ్డ కొడుకు బాగుపడి చెడిన తండ్రిని—ఆవేశం పట్టలేక కత్తితో పొడిచి చంపేశాడు.... శిక్ష బాగుంది కదూ!" అన్నాడు కాషాయాంబరధారి.

"బాగుపడిన కొడుకు వైభవం కళ్ళారా చూసుకోవాలని యే తండ్రికైనా ఉంటుంది. ఆ అవకాశానికి దూరం కావడానికి మించిన శిక్ష ఏ తండ్రికీ వుండదు. ఆ కొడుకే తండ్రిని హత్య చేయడం....ఊహ కందనంత

భయంకర శిక్ష....అంది మధుర నాయకి.

"స్త్రీ సంక్షేమాన్ని కోరి మీరింత దారుణానికి ఒడిగట్టగలిగారు. కానీ ఆ స్త్రీలలోనే పార్వతమ్మ వంటి త్యాగమూర్తులూ వున్నారు. వాళ్ళు చెడ్డవాళ్ళకు ప్రాణం పోస్తున్నారో, మంచితనానికి బాసట అవుతున్నారో నాకర్థం కావడంలేదు—" అంది అలివేలు సాలోచనగా.

"పార్వతమ్మ త్యాగం కూడా స్త్రీ సంక్షేమానికే!" అంది మధుర నాయకి—"తను తప్పు చేస్తూ—కూతురు లాంటి పిల్లని కాంక్షిస్తూ—అందుకా పిల్ల బుద్ధినే తప్పు పట్టిన తండ్రి ప్రవర్తన కొడుకులో ఎలాంటి ఆవేశాన్ని రెచ్చగొట్టిందో కళ్ళారా చూపిన పార్వతమ్మ—కొడుకు చేసినది మంచిపనే అని గ్రహించింది. ఆమెపై సన్యాసి మాటల ప్రభావమూ వుంది.

ఆ కత్తి కొడుకు ప్రాణాలు తీస్తుందంటే అర్థం—అతడు దానితో హత్య చేయబడతాడనే కాదు. దానితో హత్య చేసినా—హంతకుడై ఉరి తీయబడతాడు కదా! కొడుకు చంపింది ఓ దుర్మార్గుణ్ని! అందుకే ఆమె కొడుకును కాసేపు శాంతించమంది. ఈ లోగా ఓ చీటీ రాసింది. రాఘవులు చేయబోయిన తప్పును వివరిస్తూ—ఆ ఆవేశంలో తనే అతణ్ని చంపానని రాసింది. తర్వాత రాఘవులు హత్యచేయబడ్డ కత్తితో తన ప్రాణాల నంతం చేసుకుంది. హంతకుడు వేణు హంతకుడు కాకుండా తప్పించుకున్నాడు. అతడి ప్రవర్తన అతడి తల్లి చేత త్యాగాన్ని చేయించింది—...."

అలివేలు ఆలోచిస్తోంది.

వేణు హత్యకేసు నుంచి తప్పించుకున్నాడు. కానీ అతడి మనసు తప్పించుకోగలదా?

హంతకుడయిన వేణును తన భర్తగా అంగీకరించ గలదా?

....కాలమే అన్ని గాయాలూ మాన్పగలదు. అన్ని ప్రశ్నలకూ బదులివ్వగలదు.

మరో ఆరోమాసాల తర్వాత వేణు అలివేలును పెళ్ళి చేసుకున్నాడు.

—:అ యి పో యిం ది:—